వార్త

17 Apr 2025 - Page 3

# శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు

## -తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** పల్లెపదాల్లో పామరజనాల్లో పరిఢవిల్లిన సమాజ సంస్కృతుల్లోని మహత్వాన్ని దాక్షిణాత్యభాషల్లోనే ప్రప్రథమంగా వెలుగులోకి తెచ్చిన క్రాంతదర్శులు, శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రస్తుతించారు. సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం సంయుక్తంగా నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు సభాధ్యక్షతన నిర్వహించిన బిరుదురాజు రామరాజు శతజయంతి-సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు ప్రసంగిస్తూ జానపదాన్ని అందలం ఎక్కించి అక్షరాభిషేకం చేసిన అమృతమూర్తని, జానపదం జ్ఞానపదమంటూ వివిధ విశ్వవిద్యాలయాల్లో విశిష్ట పరిశోధనా విభాగంగా విరాజిల్లుతూ మూడు నాలుగు వందలకుపైగా పరిశోధనలు గ్రంథాలు వెలువడడానికి చూపిన దోవ రాజమార్గమన్నారు. ఎక్కడో మూలుగుతున్న ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యాలను ఎన్నింటినో సేకరించి వెలుగులోకి తెచ్చిన పరిశోధకశిఖరని కొనియాడారు. అలాగే ఎన్నో అపూర్వగ్రంథాలను తొట్టతొలిసారిగా లోకానికి పరిచయం చేశారని, మరుగుపడిన మాణిక్యాలను చరికెక్కిన చరితార్థులుగా మార్చగలిగిన పరుశవేధితనం ఆశ్చర్యదాయకమని తెలిపారు. ఆయన కాంగ్రెస్ కార్యకర్తగా ఉద్యమాల్లో చూపిన తెగువ, కనబరిచిన ఆసక్తి, సమాజ గమనమానవట్ల వారికున్న అవగాహనకు దర్పణమని వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడుగా, అధ్యాపకుడుగా, ఆచార్యుడుగా చూపిన దీక్షాదక్షతలు, కాకతీయ విశ్వవిద్యాలయ ఆవిర్భావంలో రూపురేఖలు తీర్చిదిద్దిన ఆయన సామర్థ్యం, దూరదృష్టి నేటికీ ఆదర్శప్రాయం, అనితరసాధ్యమని స్పష్టం చేశారు. ఎవరినీ యాచించని ఆత్మాభిమానం, నిలబెట్టుకున్న ఆత్మగౌరవం అభినందనీయం, అపూర్వాంశమన్నారు. అఖిలభారతస్థాయిలో జాతీయ పరిశోధనాచార్యులుగా రామరాజు పొందిన అరుదైన గౌరవం తెలుగునాట అద్వితీయం, నిరుపమానమని పేర్కొన్నారు. బిరుదురాజు రామరాజు లెక్కకుమిక్కిలిగా పొందిన సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు జీవితంలో పండించుకున్న ఉన్నతత్వానికి, సాధించుకున్న ఉత్తమమత్వానికి ఎత్తిన విజయకేతనమని విశదీకరించారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా మండలి సంచాలకురాలు సి.మృణాళిని స్వాగతోపన్యాసం కావించగా అమ్మంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములను ఆవిష్కరించారు. తదుపరి రెండు సమావేశాల్లో సదస్సు నిర్వహించగా సాయంత్రం ముగింపు సమావేశంలో బిరుదురాజు రామరాజు శతజయంతి స్మారక సంచిక సివాళిని ఆవిష్కరించారు.



బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములు ఆవిష్కరిస్తున్న నిత్యానందరావు, మృణాళిని, ఉదయవర్లు తదితర అతిథులు